క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ నరేంద్ర

గూడూరు: అనంతపురం జిల్లాలో సీఐగా పని చేస్తున్న శ్యామరావు, స్థానిక ఆయన మిత్రులు పాతబస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం గూడూరు ఎస్‌ఐ నరేంద్ర ప్రారంభించారు. పట్టణంలో తిమ్మగురుడు జాతర జరుగనున్న నేపథ్యంలో భక్తుల దాహం తీర్చడం కోసం ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సీఐ శ్యామరావుతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లాం, బోయ లక్ష్మన్న, డి. సుందరరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జె.ఆబేలు, తదితరులు పాల్గొన్నారు.

9న లక్ష్మీగణపతి హోమాలు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా ఈ నెల 9వ తేదీన వినాయక స్వామి వారికి అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివ రామకృష్ణ తెలిపారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

ఓర్వకల్లు:ఎండలు మండుతుండటంతో ప్రయాణికులకు పాస్టర్ వీరమాసు భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం చల్లటి మజ్జిగ పంపిణీ చేశారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఓర్వకల్లు ఆర్‌టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ మజ్జిగ కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి, సున్నబాషా తదితరులు పాల్గొన్నారు.

నెరవాడ రోడ్డుకు మోక్షం


రోడ్డును పరిశీలిస్తున్న ఎస్‌ఈ సుబ్రమణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దెబ్బతిన్న ఈరోడ్డుపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ లింగాల శారదమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాంభూపాల్‌రెడ్డి, శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పంచాయతీ రాజ్ అధికారులకు చెప్పడంతో శుక్రవారం ఎస్‌ఈ సుబ్రమణ్యం, ఈఈ రాం మోహన్ శుక్రవారం రోడ్డును పరిశీలించారు. ఆర్‌జీఎం మొదలు కొని, నెరవాడ గ్రామం మీదుగా పుట్టాలమ్మ ఆలయం వరకు దాదాపుగా 2.50 కోట్లతో, 3.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు వెల్లడించారు.

అట్రాసిటీ కేసు నమోదు

కల్లూరు: కులం పేరుతో దూషించిన ఘటనలో ఓ వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. కొంగనపాడు గ్రామానికి చెందిన మాదిగ బి.చిన్ననాగరాజు ఈ నెల 2వ తేదీ రాత్రి 7.30 సమయంలో బస్టాండ్ ప్రాంతంలో ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన కారం రామకృష్ణ అనే వ్యక్తి నాగరాజును ఈ ఏరియాలో ఎందుకు తిరుగుతున్నావంటూ కులం పేరుతో దూషించి అవమానపర్చాడు. అడ్డు వచ్చిన బాధితుడి కుమారుడిని చంపేస్తామని బెదిరించాడు. ఈ మేరకు చిన్న నాగరాజు ఫిర్యాదుతో రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప శుక్రవారం తెలిపారు.

మంచినీటి బోరు మంజూరు

కర్నూలు(న్యూటౌన్) : మండల పరిధిలోని గార్గేయపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే సుధాకర్ చర్యలు తీసుకున్నారు. గ్రామస్తులు సురేష్, రత్నస్వామి, సాలమోను, జయసీష్, ప్రదీప్, అయ్యస్వామి, రవి, రాజశేఖర్, చెన్నకిట్టి, హనుమన్న తదితరుల శుక్రవారం రాత్రి ఎమ్మెల్యేను కలిసి నీటి సమస్యను విన్నవించారు. వెంటనే ఆయన స్పందించి ఎస్సీ, ఎస్టీ కాలనీకి కొత్తగా తాగునీటి బోరు మంజూరు చేశారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

వీఆర్‌కు కోడుమూరు ఎస్‌ఐ

కర్నూలు : కోడుమూరు ఎస్‌ఐ విష్ణు నారాయణను వీఆర్‌కు పంపుతూ పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బందోబస్తు విధుల నిమిత్తం విజయవాడకు వెళ్లిన ఈయనపై కొంతకాలంగా అవినీతి ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపినట్లు సమాచారం.కాగా ఆయన స్థానంలో కర్నూలు త్రీటౌన్‌లో పనిచేస్తున్న శ్రీనివాసులును ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు తెలిసింది.

కోలుకోలేక మహిళ మృతి

గూడూరు రూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధురాలు కోలుకోలేక శుక్రవారం మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని బూడిదపాడుకు చెందిన మౌలాబీ(77) అనే మహిళ భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న ఈమెకు మానసికి స్థితి సరిగ్గా లేదు. ఈ క్రమంలో గత నెల 29న కొడవలితో గొంతు కోసుకుంది. ఇరుగుపొరుగు వారు గమనించి స్థానికంగా ఉన్న కుమార్తె, అల్లుడికి సమాచారం ఇవ్వడంతో వారు వారు హుటాహుటిన కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సోమ్లానాయక్ పేర్కొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగు

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య
- అట్టహాసంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ప్రారంభం


మహిళలకు వైఎస్ జగన్ సంక్షేమ పాలన గురించి వివరిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు రాజేశ్వరి నగర్‌లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ప్రారంభించారు. అంతకుముందు శకుంతల కళామందిర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని నాయకులు ఎమ్మెల్యే, మేయర్‌ను భారీ గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం రాజేశ్వరి నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు గురించి అడిగి ప్రజా మద్దతు బుక్‌లో నమోదు చేసి, 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయించారు. ఇంటి యజమాని అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టికర్‌ను అతికించారు.అనంతరం ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రజారంజక పాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు తాము ఇంటింటికీ వస్తున్నట్లు చెప్పారు. నిజయితీ, విలువలతో కూడిన రాజకీయ నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. అవినీతికి చోటు లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో 175 స్థానాలు గెలుపే తమ పార్టీ లక్ష్యమన్నారు.

ప్రజలకు చేసిన మంచిని వివరిస్తున్నాం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన మంచిని ప్రజలకు వివరిస్తున్నట్లు ఎమ్మెల్యే, మేయర్ అన్నారు. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామన్నారు. మేనిఫెస్టోను తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావిస్తారన్నారు. చాలా మంది నాయకులు ఎన్నికలు పూర్తయ్యాక హామీలను పట్టించుకోరని, అందుకు టీడీపీ అధినేత చంద్రబాబే నిదర్శనమన్నారు. 2014 ఎన్నికల సమయంలో రుణమాఫీ పేరుతో రైతులను, పొదుపు మహిళలను వంచించారన్నారు. తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం పొదుపు మహిళల రుణాలు మాఫీ చేశారన్నారు. కరోనా ప్రభావంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. గత టీడీపీ పాలన కాలంలో కూడా రాష్ట్ర బడ్జెట్ ఇలాగే ఉండేదన్నారు. అయితే, గత పాలకులు ఇన్ని సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన వారికే అప్పట్లో సంక్షేమ ఫలాలు అందేవన్నారు. ప్రస్తుతం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకే రూ. 2లక్షలు కోట్లు ఖర్చు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బి.మహేశ్వర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, పాణ్యం మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి, కార్పొరేటర్లు చిట్టెమ్మ, మాధురి, అరుణ, శ్వేతారెడ్డి, సాన శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, డీఎల్ కాంతారెడ్డి, జయరాముడు, నరసింహులు, లక్ష్మీరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు కేశవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, డైరెక్టర్లు వై.సుధా, గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, పుల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుభాషిణి పాల్గొన్నారు.


'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను ఇంటికి అతికిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: పాణ్యం సచివాలయం 1,4లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎంపీపీ ఉసేన్‌బీ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలను పలకరించారు. జగనన్న సంక్షేమ పాలనపై అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాబు, సచివాలయాల కన్వీనర్లు రవి, నారాయణ, మమత, రాఘవేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చే పాలన



ఉల్చాలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం శుక్రవారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధాకర్ స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటిని సందర్శించారు. ఐదు ప్రశ్నలతో వివరాలు సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలన, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌దే అన్నారు. కులం, మతం, వర్గం ,ప్రాంతం, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్క రికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేశారని చెప్పారు. దీంతో పేదలకు నాణ్యమైన విద్య, కార్పొరేట్ స్థాయిలో వైద్యం ఉచితంగా అందుతుందన్నారు. తాజాగా ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్య క్రమాన్ని తీసుకొచ్చారన్నారు. 2024 ఎన్నికల్లో తమ పార్టీ 175 స్థానాల్లో పోటీ చేసి గెలు పొందుతుందని చెప్పారు. ఆ దమ్ము తెలుగుదేశంకు లేదన్నారు. కార్యక్రమంలో కర్నూలు, సి బెళగల్ మండలాల ఎంపీపీలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ, బొంతల మునెప్ప, కర్నూలు మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, జెడ్పీటీసీలు గిరిజోన్, మౌలాలి, మాజీ మండల కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు గోపాల్, చిన్న లక్ష్మన్న, మధు, ఎల్ వెంకటేశ్వర్లు, మహేశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మల్లశివుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను ఇంటికి అతికిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

'శ్రీ హనుమద్ వైభవం' పుస్తకావిష్కరణ


గణేష్ నగర్‌లోని జర్నలిస్టు కాలనీలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీహనుమద్ వైభవం పుస్తకావిష్కరణ గావిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత విద్వాన్ మారేడు రాముడు రచించిన 'శ్రీ హనుమద్ వైభవం' పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం గణేష్‌నగర్‌లోని వెంకటేశ్వర, ఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగింది. సాహితీవేత్తలు వైద్యం వెంకటేశ్వరాచార్యులు, జేఎస్ఆర్కే శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తులసీ దాసు రచించిన హనుమాన్ చాలీసాకు చాలా చక్కని రీతిలో తెలుగు అనువాదం చేస్తూ సరళ కంద పద్యాలలో హనుమద్ వైభవంను రచించారన్నారు. హనుమాన్ చాలీసా చదువుకునే భక్తులకు ఇది విశేషంగా ఉపయోగ పడుతుందన్నారు. తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ దండబోయిన పార్వతీ దేవీ పుస్తక సమీక్ష చేశారు. హనుమంతుని భక్తిని శక్తిని యుక్తిని అందరం గ్రహించ వలసిన అవసరం ఉందన్నారు. హనుమాన్ జీవితం ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందవచ్చన్నారు. శ్రీపరాశర సంహితను ఉత్తర రామాయణాన్ని, తులసి రామాయణాన్ని, కంబ రామాయణాన్ని వాల్మీకి రామాయణాన్ని ఇతర రామ కథలను పరిశీలించి 83 అంశాలను హనుమద్ చరిత్రను ఒక చోట చేర్చి అందించడం రచయిత నైపుణ్యమన్నారు. కార్యక్రమంలో శతావధాని మద్దూరు రామమూర్తి, రచయిత గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, గుర్రప్ప, వెంకట రమణమూర్తి, లక్ష్మయ్య, వెంకట రామిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అటానమస్‌గా కేవీ సుబ్బారెడ్డి కాలేజీ

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి అటానమస్ కళాశాలగా గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ ఎస్.విజయ లక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. అటానమస్ గుర్తింపు నేపథ్యంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సంబరాలు చేసుకున్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం గ్రామానికి చెందిన రాజా బై గారు రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు జాకీర్, మండల కన్వీనర్ కరుణాకర్ రెడ్డి, మండల వ్యవసాయ మండలి అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉసేన్‌బాషా, మాజీ ఉప సర్పంచ్ ఆటోమాబు , జిల్లా వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు చాంద్‌బాషా ఇందులో పాల్గొన్నారు.

మోదీ ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి

కర్నూలు(సెంట్రల్): అదానీ అవినీతిపై పార్లమెంట్‌లో విపక్ష పార్టీలు అడుగుతున్న జాయింట్ పబ్లిక్ కమిటీ(జేపీసీ) వేయాలని, 9ఏళ్ల పాలనలో మోదీ ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలులోని సీఆర్ భవన్‌లో కర్నూ లు జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిన బీజేపీ ఏమి సాధించిందని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీకి పార్లమెంట్‌లో 22 పార్టీల మద్దతు ఉందని, ఆయా పార్టీలు డిమాండ్ చేస్తున్నట్లు అదానీపై జేపీసీ వేయాలన్నారు. ఆయనపై విచారణకు ఎందుకు బీజేపీ జంకుతుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. 2014 కన్నా ముందు ప్రపంచ కుబేరుల జాబితాలో 69వ స్థానంలో ఉన్న అదానీ నేడు ఏకంగా రెండో స్థానానికి ఎలా వచ్చారో ప్రజలందరికీ తెలుసన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ పాల్గొన్నారు.

ఈరోజు విద్యుత్ కోతలు

కోడుమూరు: విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్వహణలో భాగంగా కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి, పులకుర్తి, సి.బెళగల్ మండలంలోని పోలకల్, గుండ్రేవుల, బురాన్‌దొడ్డి సబ్ స్టేషన్ల పరి ధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంట ల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎలక్ట్రికల్ డీఈఈ జేసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు, వ్యాపారస్తులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.అలాగే కర్నూలు మండలాల్లోని 33, 11కేవీ ఫీడర్లు, గ్రామాల్లో కూడా విద్యుత్ కోతలుంటాయని విద్యుత్ అధికారులు తెలిపారు.

మెగా జాబ్ మేళా

కోడుమూరు రూరల్: నిరుద్యోగ యువతీ యువకుల కోసం శనివారం కోడుమూరులోని స్నేహ వినాయక కల్యాణ మండపంలో కుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జగనన్న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ స్టేట్ కమిటీ సభ్యుడు సంధ్యవిక్రమ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ జాబ్ మేళాకు ముత్తూట్, అపోలో, టాటా, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, ఆదాని సొల్యూషన్ తదితర 35రకాల కంపెనీలు వస్తాయన్నారు. 10వతరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ ఆపై చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొని జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచలింగాలలో గడపగడపకు మన ప్రభుత్వం

కర్నూలు(న్యూటౌన్) : ఈనెల 8వ తేదీ శనివారం ఉదయం 7:30 గంటలకు పంచలింగాల గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ ఎస్.భాస్కర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు


బండను లాగుతున్న వృషభాలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలో శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఎస్‌ఐ సోమ్లానాయక్, గ్రామ పెద్దలు గోపాల్‌రెడ్డి, సురేష్, పత్తి మద్దిలేటి, డీలర్ చిన్న మద్దిలేటి, ఎంపీటీసీ కుర్వ మద్దిలేటి, ఈరన్న ప్రారంభించిన ఈ పోటీల్లో మొత్తం 13 కాడెద్దులు పాల్గొన్నాయి. ఇందులో నాగర్ కర్నూలు యాదిరెడ్డిపల్లెకు చెందిన అఖిలేశ్వర్‌రెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలువగా రూ. 50,000 నగదు బహుమతిని దాత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి గ్రామ కమిటీ సభ్యుడు అందించారు. రెండవ స్థానంలో గద్వాల జమ్మిషెడ్‌కు చెందిన వెంకటేష్, కర్నూలుకు చెందిన మహేంద్రరాయుడు వృషభాలు నిలువగా రూ. 40,000 బహుమతిని దాత తలారి సుధాకర్, మూడవ స్థానంలో నిలిచిన అనంతపురం బుక్కారాయ సముద్రానికి చెందిన శంకర్ నాయక్ వృషభాలకు దాత చంద్రశేఖర్‌రెడ్డి రూ. 30,000 అందించగా, నాలుగవ స్థానంలో నిలిచిన ఓర్వకల్లుకు చెందిన మంగలి నడిపి వెంకటేశ్వర్లు వృషబాలకు రూ. 20,000 దాత నిచినో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఐదవ స్థానంలో నిలిచిన పత్తికొండ గొంగలి చంద్ర వృషభాలకు రూ. 10,000ను దాత గోపాల్‌రెడ్డి, ఆరవ స్థానంలో నిలిచిన గుత్తికి చెందిన బాలాజీ వృషభాలకు రూ. 5000ను దాత పత్తి మద్దిలేటి అందించారు. కార్యక్రమంలో కన్వీనర్ గిడ్డయ్యనాయుడు, యాంకర్ బాషా, మధు, శ్రీనివాసులు, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

పొట్టేల పోటీలు

సుంకులాపరమేశ్వరీదేవి జాతర సందర్భంగా శుక్రవారం కె. నాగులాపురంలో పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. ఎస్‌ఐ సోమ్లానాయక్, గ్రామ పెద్దలు గోపాల్‌రెడ్డి, సురేష్, పత్తి మద్దిలేటి, డీలర్ చిన్న మద్దిలేటి, శ్రీనివాసులు ఈ పోటీలను ప్రారంభించారు. విజేత పొట్టేళ్ల యజమానులకు దాతలు నగదు బహుమతులు అందజేశారు.

వెనుకబడిన తరగతుల సంక్షేమానికి పెద్దపీట

కర్నూలు కల్చరల్: బీసీల సంక్షేమానికి బీజేపీ పెద్దపీట వేస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి వాల్మీకి అన్నారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలోనే బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఓబీసీల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. బీసీలను అక్కున చేర్చుకునేందుకు ఈ నెల 16వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా ఇంటింటికి, గ్రామగ్రామానికి ఓబీసీ మోర్చా కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కులానికో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం వాటి నిర్వహణకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. జోహరాపురం నీలకంఠేశ్వర స్వామి దేవాలయం భూములు సర్వే నెం.123లో ఉన్న 7.72 ఎకరాలను సీపీఐ వారు జెండాలు పాతి కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ మురళీ నాయుడు, నీలకంఠేశ్వర స్వామి ఆలయం కమిటీ కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు మాట్లాడారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం


క్రిష్ణదొడ్డిలో జనసందోహం మధ్య సాగుతున్న శ్రీ వారి రథం


అశ్వవాహనంపై శ్రీవారు

సి బెళగల్: క్రిష్ణదొడ్డి గ్రామం కొండపై వెలసిన శ్రీ కోన వేంకటేశ్వర స్వామి రథోత్సవ కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామికి మండలంలోని సి.బెళగల్, బురాన్‌దొడ్డి, కంబదహాల్, ఇనగండ్ల, సంగాలతో పాటు గూడూరు, కోడుమూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూర్ మండలాలకు చెందిన భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేసి రాత్రి మూడు గంటలకు కుంభంను ప్రారంభించారు. రథం వద్దకు చేరుకున్న తర్వాత మహారథోత్సవం నిర్వహించారు. వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శుక్రవారం సాయంత్రం అశ్వని, గజారోహణం అనంతరం పారువేట నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోడుమూరు సీఐ శ్రీధర్, సి.బెళగల్ ఎస్‌ఐ పీరయ్య పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. శనివారం ఆదిదంపతులకు వసంతోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కాగా కొండపై విచ్చలవిడిగా జూదం సాగింది. పోలీసులు కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

లోక రక్షకుడు ఏసు

- ఘనంగా గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు


ఓర్వకల్లులో..భక్తి గీతాలు ఆలపిస్తూ రెవరెండ్ ఆనంద్ శిలువ మోస్తున్న దృశ్యం

పాణ్యం: సకల మానవుల పాప పరిహారం కోసం ప్రాణమిచ్చిన ప్రభువు ఏసుక్రీస్తు అని వివిధ చర్చిల ఫాదర్లు పేర్కొన్నారు. శుక్రవారం పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు దైవ సందేశమిచ్చారు. సర్వ జనులకోసం ఏసుక్రీస్తు శిలువ మరణం పొందిన రోజునే గుడ్‌ఫ్రై డే నిర్వహిస్తున్నామన్నారు.

- మండల కేంద్రం పాణ్యంలో ఇంటింటి సువార్త మందిరంలో పాస్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే పాణ్యం ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న ధహించు అగ్ని జీసెస్ వర్షిన్ సెంటర్‌లో పాస్టర్ బాబన్న దైవ సందేశమిచ్చారు.
- ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, పూడిచెర్ల, ఓర్వకల్లు, హుసేనాపురం, సోమ యాజులపల్లె, పాలకొలను, బ్రాహ్మణపల్లె, శకునాల గ్రామాల్లోని ప్రార్థన మందిరాలు క్రైస్తవులతో కిటకిటలాడాయి. ఓర్వకల్లు గ్రామంలో ఆర్‌సీఎం సంఘస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెవ.ఫా. ఆనంద్ దైవ సందేశం ఇచ్చారు.
- గూడూరు రూరల్: మండలంలోని బూడిదపాడు, కె.నాగలాపురం, పెంచికలపాడు, గుడిపాడు, జూలకల్, చనుగొండ్ల, మునగాల గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.
- కోడుమూరు రూరల్: యేసు చూపిన మార్గంలో నడుద్దామని కోడుమూరు పట్టణంలో ఏబీఎం చర్చి రెవరెండ్ ఆర్.సామెల్ పిలుపునిచ్చారు. శుక్రవారం కోడుమూరుతో పాటు మండలంలోని వర్కూరు, పులకుర్తి, కల్లపరి, లద్దగిరి, గోరంట్ల, ప్యాలకుర్తి, అమడగుంట్ల తదితర గ్రామాల్లో శుభ శుక్రవారం వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

సి.బెళగల్: మండలంలోని చర్చిలు క్రైస్తవులతో కిక్కిరిశాయి. సి. బెళగల్, పోలకల్, ఇనగండ్ల, కంబదహాల్, ముడుమాల, కొత్తకోట, బురాన్‌దొడ్డి, కొండాపురం గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

- కల్లూరు: శుభశుక్రవారాన్ని పురస్కరించుకుని కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- గడివేముల: మండలంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు త్యాగనిరతిని కీర్తిస్తూ వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు.




కోడుమూరు ఏబీఎం చర్చిలో ప్రార్థనలకు హాజరైన మహిళలు, సి.బెళగల్‌లో దైవ సందేశమిస్తున్న పాస్టర్ సులోమన్, గడివేముల ఏబీఎం చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

సుంకేసులకు నిలిచిన ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి శుక్రవారం ఎగువ నుంచి నీటి ప్రవాహంనిలిచిపోయింది. ప్రస్తుతం డ్యాంలో 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

SREE RAYALASEEMA CHRISTIAN COLLEGE OF EDUCATION
George Avenue, A-Camp, Kurnool
B.Ed., M.Q and Spot Admissions 2022-24
Under "B" Category - 25%, No. of Seats : 25
Under Spot Admissions - 53 Seats, EWS - 10
Qualifications : Any Graduate B.A., B.Com., B.Sc., B.Tech for OC Category 50% Marks, B.C., S.C., S.T - 45% of Degree Marks.
Fees : As Prescibed by Govt. of A.P.
Last Date (to received applications) : 10-04-2023
Principal
Contact : 94402 53472, 08518-277571